సాక్షి రంగారెడ్డి

శుక్రవారం : 6 : సెప్టెంబర్ : 2024



పట్టు పురుగుల పెంపకంతో

పట్టు పురుగుల పెంపకంతో అధిక లాభాలు ఆర్జించవచ్చని హైదరాబాద్ పట్టు పరిశ్రమశాఖ జేడీ లత అన్నారు. 10లో▸



పాతబస్తీపై ప్రత్యేక దృష్టి

గ్రేటర్‌లో ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికి చర్యలు చేపడుతున్న జీహెచ్‌ఎంసీ.. ప్రస్తుతం పాతబస్తీపై దృష్టి సారించింది. 10లో▸



ఫార్మాను అడ్డుకుంటాం..

దుద్యాలలో ఫార్మాసిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ.. కొడంగల్ రైతులు యాచారం మండలంలో పర్యటించారు. 10లో▸

న్యూస్‌రీల్

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

కొత్తూరు: ఆర్‌అండ్‌బీ రోడ్డు సమీపంలో అక్రమంగా నిర్మించిన దుకాణాలను గురువారం మున్సిపల్ అధికారులు తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పట్టణంలో రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో ఈ కట్టడాలను తొలగించినట్లు వెల్లడించారు. విస్తరణ అనంతరం రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ పైపులైన్లను వేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు చిరువ్యాపారులు సహకరించాలని కోరారు. కాగా దుకాణాల కూల్చివేతను వ్యాపారులు వ్యతిరేకించారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఎలా తమ డబ్బాలను ధ్వంసం చేస్తారని ప్రశ్నించారు. తమకు కొంత గడువు ఇవ్వాలని ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులను వారు కోరారు. రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న డబ్బాలను తొలగించకుండా పనులు చేపట్టాలని విన్నవించారు.

గ్రామీణాభివృద్ధిలో నాబార్డు కీలక పాత్ర

టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య



క్లస్టర్ కార్యాలయం ప్రారంభోత్సవంలో డీసీసీబీ చైర్మన్ తదితరులు

తుర్కయంజాల్: గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడంతో పాటు.. రైతు సంక్షేమానికి నాబార్డు కీలక పాత్ర పోషించనుందని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, నాబార్డు సీజీఎం చింతల సుశీల అన్నారు. మున్సిపల్ పరిధి రాగన్నగూడలో ఏర్పాటు చేసిన నాబార్డు జిల్లా క్లస్టర్ కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. గతంలో కార్యాలయం నగరంలో ఉండటంతో రైతులు ఇబ్బంది పడ్డారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని స్థానికంగా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యాలయం రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, హైదరాబాద్‌కు చెందిన వారికి అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీజీఎం శ్వేతాసింగ్, ఆర్‌బీఐ ఏజీఎం లక్ష్మీ శ్రావ్య, డీడీఎంలు అఖిల్ పున్నా, హర్ష రఘురామ్, కమర్షియల్ బ్యాంకులు, సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు గౌడలు ఏకం కావాలి

వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

మొయినాబాద్: గౌడ కులస్తులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలంటే అందరూ ఏకం కావాలని కల్లుగీత వృత్తిదారులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటుకు గురువారం భూమి పూజ చేశారు. అనంతరం భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దళిత బహుజన వర్గాలను కలుపుకొని మూడు శతాబ్దాల క్రితం పాపన్నగౌడ్ గోల్కొండ కోట నుంచి సుపరిపాలన అందించారని పేర్కొన్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచి.. ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకుందామన్నారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీశైలంగౌడ్, ప్రధాన కార్యదర్శి చేగూరి రామకృష్ణగౌడ్, మాజీ ఎంపీటీసీ చిరాగ్ మోహన్‌గౌడ్, నాయకులు వెంకటేశ్ గౌడ్, నర్సింహ్మగౌడ్, ఆంజనేయులు గౌడ్ ఉన్నారు.

మట్టి గణపతులనే పూజిద్దాం

మేయర్ విజయలక్ష్మి



జీహెచ్‌ఎంసీ ఉద్యోగులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న మేయర్

సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మట్టి వినాయక ప్రతిమలను పూజిద్దామని మేయర్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించడం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు.



వేడుకలకు హాజరైన ఉత్తమ ఉపాధ్యాయులు

గురుతర బాధ్యత మీదే..

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

- ప్రభుత్వ పాఠశాలలను మహోన్నతంగా తీర్చిదిద్దాలి
- విద్యార్థుల్లో సమానత్వం, సోదరభావాలను పెంపొందించాలి
- గురుపూజోత్సవంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల అందజేత

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది. గురుతర బాధ్యతను ఎరిగిన వారికే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుంది' అని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 170 మంది టీచర్లకు గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అవార్డులు ప్రదానం చేశారు. శాలువా, ప్రశంసా పత్రాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లా పరిగిలో బాబా మొయినొద్దీన్ అనే ఉపాధ్యాయుడు ఇంటింటికి తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారని, ఆయన తన జీవితమంతా పిల్లలకే అంకితం చేశారని, గురువుగా ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ప్రతీ ఉపాధ్యాయుడు అలా పని చేస్తే ప్రభుత్వ పాఠశాలలు నిజమైన దేవాలయాలుగా రూపు దిద్దుకుంటాయని తెలిపారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోని మెజార్టీ పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఒకప్పుడు ఎంతో మందిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దిన ఆయా పాఠశాలలు నేడు విద్యార్థులు లేక ఎందుకు వెలవెలబోతున్నాయో, ఇందుకు కారణం ఎవరో..? ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు మంచి విద్యను బోధించి, వారు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి వారధిగా నిలవాల్సిన వారిలో కొంతమంది.. కేవలం నెల జీతం కోసమే పని చేస్తున్నట్లుగా ఉందన్నారు. అమెరికా వంటి దేశాల్లో 90 శాతం మంది చిన్నారులు ప్రభుత్వ పాఠశాల్లోనే చదువుతుంటారని, మన రాష్ట్రంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమనత్వాన్ని, సోదరభావాన్ని బోధించాల్సిన పాఠశాలలు.. అసమానతలు, అవమానాలకు వేదికగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ తీరు పూర్తిగా మారాలని, అది ఉపాధ్యాయులతోనే సాధ్యమని తెలిపారు. ఏపీజే అబ్దుల్‌కలాం వంటి మహనీయులు సైతం ప్రభుత్వ స్కూళ్లలోనే చదువుకున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్, కలెక్టర్ శశాంక, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీఈఓ సుశీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేస్తున్న ఎంపీ కొండావిశ్వేశ్వర్ రెడ్డి, కలెక్టర్ శశాంక








మరిన్ని చిత్రాలు 10లో▸

డబ్బులిస్తేనే బాబా దర్శనం!

పైసలు ఉంటేనే పరమాత్ముడి దర్శనం అనేది బహిరంగ రహస్యమే. ఇది విపరీతంగా మారడం భక్తుల పాలిట శాపంగా పరిణమించింది. సుదూర ప్రాంతాల నుంచి బాబా దర్శనానికి వచ్చిన భక్తుల ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. వేలాది రూపాయలు హుండీలో వేస్తేనే దర్శనం అంటూ హుకుం జారీ చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..

- జేపీదర్గా హుండీ టెండర్ నిర్వాహకుల హుకుం
- భక్తులను దోచుకుంటున్న కాంట్రాక్టర్లు
- ఇదేమని ప్రశ్నించిన వారిపై దాడులు
- పట్టించుకోని వక్ఫ్‌బోర్డు



జేపీదర్గా

కొత్తూరు: ప్రఖ్యాతి గాంచిన జేపీదర్గాకు తెలంగాణ, పొరుగు రాష్ట్రాల భక్తులు బాబ దర్శనం కోసం ఇక్కడికి వస్తుంటారు. ఇదే అదనుగా భావించిన హుండీ టెండర్లు దక్కించుకున్న వారితో పాటు అక్కడి పలువురు వ్యాపారులు నిలువు దోపిడీకి పాల్పడుతున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. తాము కోట్ల రూపాయలు వెచ్చించి టెండర్లు దక్కించుకున్నామని, ఇదే తరహాలో భక్తుల నుంచి డబ్బులు వసూళ్లు చేస్తామంటూ పేర్కొనడం గమనార్హం.

రూ.2 వేలు ఇస్తేనే..

హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి తన మొక్కుబడిలో భాగంగా నెల క్రితం జేపీ దర్గాలో న్యాజ్(కందూరు) నిర్వహించాడు. అనంతరం బాబా దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి దర్గాలోకి వెళ్లాడు. అక్కడి హుండీ టెండర్ల నిర్వాహకులు గల్లలో రూ.2 వేలు వేస్తేనే దర్శనం అనగా.. ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎవరికైనా చెప్పుకోండి.. పైసలు ఇస్తేనే బాబా దర్శనమని దబాయించడంతో పదిహేను వందల రూపాయలు సమర్పించుకున్నాడు.

పోలీసులను ఆశ్రయించిన భక్తుడు

రెండు నెలల క్రితం షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన ఓ వ్యక్తి దర్గాలో న్యాజ్ నిర్వహించాడు. అనంతరం బాబాకు నైవేద్యం సమర్పించాడు. దర్శనం కోసం కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి లోపలికి వెళ్లగా.. అక్కడి వారు రూ.3 వేలు హుండీలో వేయాలన్నారు. దీనికి నిరాకరించిన భక్తుడు.. తాను అంత ఇచ్చుకోలేనని చెప్పగా.. నిర్వాహకులు అతన్ని తోసి వేశారు. అంతటితో ఆగకుండా.. దౌర్జన్యానికి పాల్పడినట్లు బాధితుడు వాపోయాడు. ఇదే ఘటనపై సదరు భక్తుడు పోలీసులను ఆశ్రయించాడు. వీరి ఆగడాల నేపథ్యంలో దర్గా దర్శనానికి భక్తుల రాక తగ్గినట్లు ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు.

భౌతిక దాడులు

దర్గా ఆవరణలో పూలు విక్రయించే వ్యాపారులు దర్శనం కోసం వచ్చే భక్తుల వాహనాలను తమ షెడ్డు వద్దే నిలపాలని డిమాండ్ చేస్తున్నారు. మరోచోట వాహనం నిలిపి పూలు తీసుకుంటామని భక్తులు చెప్పినా, వినకుండా ఇక్కడే ఉంచాలని దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. వీరి చేష్టలకు విసిగి.. ప్రశ్నించిన వారిపై వ్యాపారులు దాడులకు పాల్పడుతున్నారు.

పట్టించుకోని వక్ఫ్‌బోర్డు

జేపీదర్గా హుండీ టెండర్లను వక్ఫ్‌బోర్డు ఏటా నిర్వహిస్తుంది. టెండర్లను దక్కించుకోవడానికి వ్యాపారులు పోటీ పడుతుంటారు. రూ.కోట్లు వెచ్చించి దక్కించుకుంటారు. అనంతరం పెట్టిన పెట్టుబడితో పాటు.. లాభాలు రాబట్టుకునేందుకు భక్తుల ముక్కు పండి వసూళ్లకు పాల్పడుతున్నారు. వేలాది రూపాయలు హుండీలో వేయాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇదే విషయం పలువురు భక్తులు.. వక్ఫ్‌బోర్డు అధికారుల దృష్టికి వెళ్లినా, వారు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టంగా వ్యవహరిస్తున్నారు.

వసూళ్లకు పాల్పడవద్దు



దర్గా దర్శనానికి వచ్చిన భక్తుల నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడవద్దు. భక్తులను గౌరవించడం నేర్చుకోవాలి. దర్గాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. స్థానికులు, భక్తులు, వ్యాపారులు అన్ని విధాలుగా సహకరించాలి. భక్తులకు ఇబ్బందులు కలిగించే వారు తమ తీరును మార్చుకోవాలి.

– వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్యే, షాద్‌నగర్

చర్యలు తప్పవు



బాబా దర్శనం కోసం వచ్చే భక్తులను వ్యాపారులు ఇబ్బంది పెట్టవద్దు. వారిని ఇబ్బందులకు గురిచేసినా.. దాడులు చేసినా సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. నిర్వాహకులు, వ్యాపారులు నిబంధనలు పాటించాలి. భౌతిక దాడులకు పాల్పడినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. కేసులు నమోదు చేస్తాం.

– నర్సింహారావు, సీఐ, కొత్తూరు

ఎందుకలా చేశావమ్మా..



మంగ మృతదేహం



శరత్ మృతదేహం



ప్రమాదం నుంచి బయటపడిన విఘ్నేష్

- ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులో దూకిన మహిళ
- తల్లి, కుమారుడి మృతదేహాలు లభ్యం
- కూతురు బాడీ కోసం గాలింపు
- ఇబ్రహీంపట్నంలో విషాదం

ఇబ్రహీంపట్నం: ఆ తల్లికి ఎంత కష్టమొచ్చిందో తెలియదు.. అభంశుభం తెలియని ఇద్దరు పిల్లలతో కలిసి చెరువులో దూకి బలవన్మరణానికి పాల్పడింది. తల్లి, కుమారుడి మృతదేహాలు లభించగా కూతురు కోసం గాలిస్తున్నారు. మరో చిన్నారి ఈ ప్రమాదం నుంచి బయటపడింది. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ మునగనూర్ ప్రాంతానికి చెందిన ఓర్సు మంగ(38) తన కూతురు, ఇద్దరు కుమారులను వెంటబెట్టుకొని గురువారం సాయంత్రం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్దకు చేరుకుంది. స్నానం చేద్దామని చెప్పి పిల్లలతో కలిసి కట్ట కిందికి దిగింది. మంగతో పాటు ఆమె కూతురు లావణ్య(14), పెద్ద కుమారుడు శరత్(7) చెరువులోకి దూకారు. చిన్న కుమారుడు విఘ్నేష్(5) నీళ్ల పక్కనే నిలబడి ఉండిపోయాడు. ఎంత సేపటికీ తన వాళ్లు బయటకు రాకపోవడంతో ఏడ్చుకుంటూ కట్టపైకి వచ్చాడు. ఇది గమనించిన వాహనదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే చేరుకున్న మున్సిపల్, పోలీసు సిబ్బంది చెరువులో గాలించగా మంగ, శరత్ మృతదేహాలు లభించాయి. లావణ్య కోసం గాలిస్తున్నారు. పిల్లలు వేసుకున్న స్కూల్ డ్రెస్ ఆధారంగా వనస్థలిపురం ప్రశాంతి విద్యానికేతన్‌లో చదువుతున్నట్లు తెలిసింది. ఈ మేరకు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుల కుటుంబం మునగనూర్‌లో నివసిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులే ఆత్మహత్యలకు కారణమని తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మెట్రో పార్కింగ్‌లే టార్గెట్

పోలీసుల అదుపులో బైక్ దొంగల ముఠా

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మెట్రో రైల్ స్టేషన్ పార్కింగ్‌లో ఉన్న ద్విచక్ర వాహనాలను టార్గెట్‌గా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా ఎట్టకేలకు చిక్కింది. ఇటీవలి కాలంలో ఈ తరహా ఫిర్యాదులు ఎక్కువ కావడంతో హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. మెట్రో రైల్ పార్కింగ్ స్థలాలతో పాటు ఇతర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాలు, సాంకేతిక ఆధారాలను బట్టి ముందుకు వెళ్లిన పోలీసులు.. గురువారం ఖమ్మంలోని అశ్వారావుపేటలో చోరుల ఆచూకీ గుర్తించారు. అక్కడకు వెళ్లిన ప్రత్యేక బృందం వారిని అదుపులోకి తీసుకుంది. విచారణ నేపథ్యంలో ఇప్పటి వరకు 50కి పైగా వాహనాలు చోరీ చేసి విక్రయించినట్లు వెల్లడైంది. వీటిని రికవరీ చేయడంపై దృష్టి పెట్టిన అధికారులు.. 30 వాహనాల ఆచూకీ కనుగొన్నట్లు సమాచారం. నిందితులను హైదరాబాద్ తరలిస్తున్న పోలీసులు.. మిగిలిన వాహనాలు ఎక్కడనేది ఆరా తీస్తున్నారు.



మాసబ్‌చెరువును పరిశీలించిన చెరువు పరిరక్షణ సమితి సభ్యులు

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

తుర్కయంజాల్: మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని చెరువు పరిరక్షణ సమితి సభ్యులు డిమాండ్ చేశారు. గురువారం సమితి సభ్యులు మాసబ్ చెరువును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో అమాయకులకు ప్లాట్లను అంటగట్టిన వ్యాపారులతో పాటు, అక్రమ వెంచర్లకు సహకరించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులపైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్‌నాయక్, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు ప్రతాప్, సీపీఎం జిల్లా నాయకుడు కిషన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు యాదిరెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, వంశీదర్‌రెడ్డి, కరుణాకర్, పురుషోత్తం, వీరేశం, అజయ్, వినోద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్రికెట్‌కు మంచి రోజులు

- కమ్మదనం క్యాంపస్ బాగుంది
- గురుకులాల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మి



క్రీడాకారులతో గురుకులాల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మి

షాద్‌నగర్ రూరల్: గురుకులాల్లో చదువుతున్న విద్యార్థినులను క్రికెటర్లుగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని గురుకులాల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అనంతలక్ష్మి అన్నారు. గురువారం ఆమె ఫరూఖ్‌నగర్ మండల పరిధి కమ్మదనం గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలను పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా బాలికలు క్రికెట్ ఆడగా.. వారి ఆట తీరును చూసి ఆమె అభినందించారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థినులు చదువుతో పాటు.. ఆటల్లో రాణించాలని సూచించారు. క్రికెట్‌లో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి, జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇందులో భాగంగా విద్యార్థినుల కోసం అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన కోచింగ్ ఇప్పించేందుకు గురుకులాల రాష్ట్ర కార్యదర్శి అలుగువర్షిణి కృషి చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. గతంలో గురుకుల విద్యార్థులు పూర్ణ, ఆనంద్‌తో పాటు ఎంతో మంది అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని, వారిని ప్రేరణగా తీసుకోవాలని సూచించారు. కమ్మదనం గురుకులంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు క్రికెట్ నేర్చుకునేందుకు క్రికెట్ అకాడమీని ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, బాలికలు ఆటల్లో రాణించాలన్నారు. ఇంటర్ సొసైటీ క్రికెట్ టోర్నీని కమ్మదనం క్రీడా ప్రాంగణంలో నిర్వహించేందుకు అలుగువర్షిణి నిర్ణయించినట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యుల్లత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఫార్మా సిటీని అడ్డుకుంటాం



నక్కర్తమేడిపల్లిలో పర్యటిస్తున్న కొడంగల్ నియోజకవర్గ రైతులు

- యాచారంలో పర్యటించిన కొడంగల్ నియోజకవర్గ కర్షకులు
- స్థానిక నాయకుల పోరాట వివరాలను తెలుసుకున్న భూ బాధితులు

యాచారం: సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ రైతులు గురువారం యాచారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కొడంగల్‌లోని దుద్యాల మండలంలో సర్కారు ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి నిర్ణయించిన నేపథ్యంలో ఆ మండల పరిధిలోని లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, ఆర్బీతండా, పులిచర్లకుంటతండా, ఈర్లపల్లితండాలకు చెందిన 20 మంది రైతులు యాచారంలో పర్యటన చేశారు. గత బీఆర్ఎస్ సర్కారు ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని 10 గ్రామాల్లోని 19,333 ఎకరాల్లో ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది తెలిసిందే. దీనిని ఈ ప్రాంత రైతులు ఏ విధంగా అడ్డుకున్నారు, పోరాటాలు ఎలా చేశారు, న్యాయస్థానాలకు ఎలా వెళ్లారు.. తదితర వివరాలను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు కావాలనే మా కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మాసిటీని ఏర్పాటు చేయడానికి నిర్ణయించిందని ఆ మండల రైతులు ఆరోపించారు. మీ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని ఫార్మాసిటీని ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటామని ప్రకటించారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లో పర్యటించారు. కొడంగల్ రైతులకు ఆయా గ్రామాల అన్నదాతలు తమ పోరాటాలను తెలియజేసి ధైర్యం నూరి పోశారు.

పట్టు పురుగుల పెంపకంతో లాభాలు



మల్బరీ తోటను పరిశీలిస్తున్న అధికారులు

తలకొండపల్లి: పట్టు పరుగుల పెంపకం (సెరీ కల్చర్)తో అధిక లాభాలు ఆర్జించవచ్చని హైదరాబాద్ పట్టు పరిశ్రమశాఖ జేడీ లత పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ఏడాదంతా పంటలను తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. మండల పరిధిలోని కోరింతకుంట తండా, వెంకట్రావ్‌పేట, హర్యానాయక్ తండాల్లో గురువారం మండల ప్రత్యేకాధికారి ముత్యాలుతో కలిసి ఆమె పర్యటించారు. మల్బరీ తోట, పట్టు పురుగుల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లత మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతులు, నిరుద్యోగ యువతకు చక్కటి ఉపాధిని పట్టు పరిశ్రమ శాఖ అందిస్తోందని తెలిపారు. పట్టు పరిశ్రమ శాఖకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మల్బరీ తోటల పెంపకం నుంచి షెడ్డు నిర్మాణం వరకు.. పట్టు పురుగుల పెంపకం దశ నుంచి మార్కెటింగ్ వరకు అనేక రాయితీలను ప్రభుత్వాలు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గురువులకు వందనం

నేటి బాలలే రేపటి పౌరులంటారు. అలాంటి చిన్నారులను దేశం గర్వించదగ్గ ప్రయోజకులుగా చేయడంలో గురువుల పాత్ర అమోఘం. ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థుల ఉన్నతికి నిరివ్వరామంగా కృషి చేస్తున్న గురువులను కీర్తించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ శశాంక సమక్షంలో ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేసి శాలువాతో సన్మానించారు.

– సాక్షి, రంగారెడ్డి జిల్లా









ఇక పాతబస్తీపై ప్రత్యేక దృష్టి



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ట్రాఫిక్ చిక్కుల పరిష్కారానికి వివిధ చర్యలు చేపడుతున్న జీహెచ్ఎంసీ ప్రస్తుతం పాతబస్తీపై దృష్టి సారించింది. ఇరుకు రహదారుల్లో ట్రాఫిక్ చిక్కులను తప్పించేందుకు ఆయా ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, అవసరమైన ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణాలు చేయాలని గతంలోనే భావించింది. అందుకనుగుణంగా కొన్ని ప్రాంతాల్లో దాదాపు రూ. 150 కోట్లు ఖర్చు చేసి సంబంధిత అధికారులు భూసేకరణ సైతం జరిపారు. పనులు మాత్రం ఇప్పటివరకు ప్రారంభం కాకపోవడంతో భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లోనూ మళ్లీ ఆక్రమణలు జరిగేందుకు అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో త్వరితగతిన పనులు చేపట్టేందుకు కమిషనర్ ఆమ్రపాలి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. సంబంధిత ప్రాజెక్టులకు పూర్తిస్థాయి ప్రణాళికతో పాటు సరైన అంచనా వ్యయం, తదితర పనులు పూర్తి చేసి టెండర్లు పిలిచి పనులు చేపట్టాల్సిందిగా సంబంధిత ఇంజినీరింగ్ (ప్రాజెక్ట్స్) అధికారులకు సూచించారు. ఆక్రమణలుంటే తొలగించాల్సిందిగా ఆదేశించారు. భూసేకరణ పూర్తికాని ప్రాంతాల్లో త్వరితంగా పూర్తిచేయాలని సూచించారు.

ఇవీ పనులు..

- చేయాల్సిన పనుల్లో బెంగళూర్ నేషనల్ హై వే నుంచి శాస్త్రిపురం జంక్షన్ వరకు, శాస్త్రిపురం జంక్షన్ నుండి ఇంజన్ బౌలి వరకు వరకు వంద అడుగుల రోడ్డు విస్తరణ, అజీం హోటల్ నుంచి చర్చి గేట్ వరకు (షోహెబ్ హోటల్ నుంచి బాలాపూర్ రోడ్)80 అడుగుల రోడ్డు, చాంద్రాయణ గుట్ట క్రాస్ రోడ్ నుంచి చాంద్రాయణ గుట్ట పోలీస్ స్టేషన్ మీదుగా బార్కాస్ రోడ్ వరకు 60 అడుగుల రోడ్డు, లక్కీస్టార్ హోటల్ నుంచి హఫీజ్‌బాబానగర్ వరకు, బండ్లగూడ నుంచి ఎర్రకుంట వరకు రోడ్డు విస్తరణ, హఫీజ్ బాబా నగర్ జంక్షన్, బండ్లగూడ జంక్షన్‌ల వద్ద ఫ్లైఓవర్‌లు, ఓవైసీ జంక్షన్ వద్ద ఎడమ వైపు డౌన్ ర్యాంపు నిర్మాణం తదితరాలు ఉన్నాయి.
- కమిషనర్ ఆమ్రపాలి గురువారం బండ్లగూడ ఫ్లైఓవర్ జంక్షన్, బండ్లగూడ నుంచి ఎర్రకుంట వరకు రోడ్డు విస్తరణ, తులసీ నగర్ నుంచి గౌస్ నగర్ వరకు ఫ్లై ఓవర్, బాబా బజార్ నుంచి భవాని నగర్ వరకు, షేక్ ఫైజ్ కమాన్ నుంచి డబీర్ పుర ఫ్లైఓవర్ వరకు ప్రతిపాదిత రోడ్ల విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఫలక్‌నుమాలో చేపట్టనున్న ఆర్‌ఓబీ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) ఎం. దేవానంద్, ఎస్ఈ దత్తు పంత్, చార్మినార్ జోన్ సిటీ ప్లానర్ మాజిద్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆఫీస్‌కి వెళ్తూ..అనంత లోకాలకు

రోడ్డు ప్రమాదంలో
ఫాక్స్‌కాన్ ఉద్యోగి దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: మరో ఐదు నిమిషాల్లో ఆఫీస్ చేరే ఉద్యోగిని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. జీహెచ్ఎంసీ చెత్త తరలించే వాహనం ఢీకొట్టడంతో ఫాక్స్‌కాన్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన పి.సిద్ధన్న(23) నగరంలోని ఆసీఫ్‌నగర్‌లో నివాసం ఉంటూ కొంగరకలాన్ సమీపంలోని ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజు మాదిరిగానే తన బైక్‌పై గురువారం ఉదయం రావిర్యాల మీదుగా ఆఫీస్‌కి బయలు దేరాడు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు నుంచి చెర్వుకట్ట సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న జీహెచ్ఎంసీ చెత్త తరలించే వాహనం అతడి ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సిద్ధన్న అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మ రో ఐదు నిమిషాల్లో ఆఫీస్ చేరుకునే తమ సహచరు డు విగతజీవిగా మారడంతో తోటి ఉద్యోగులు విలపించారు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వా హనం నడుపుతున్న డ్రైవర్ బొంతల రామబాయిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకం



పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

అంబర్‌పేట: బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం సర్దార్ సర్వాయి పాపన్న చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. అంబర్‌పేట గౌడ్ సంఘం ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాసన మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్‌లతో కలిసి మంత్రి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాలు రాజ్యాధికారం కోసం నిరంతరం పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, రాష్ట్ర హ్యాండ్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్, కార్పొరేటర్లు విజయ్ కుమార్ గౌడ్, పద్మా వెంకట్‌రెడ్డి, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, టీపీసీసీ కార్యదర్శి శంభూల శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షులు రాలు శంభూల ఉష శ్రీకాంత్ గౌడ్, గౌడ్ సంఘం చైర్మన్ పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, అధ్యక్షుడు బింది రాజ్‌గౌడ్, ఉపాధ్యక్షులు రమేశ్‌గౌడ్, రంగనాథ్ గౌడ్ పాల్గొన్నారు.